సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 23 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.35, కనిష్టంగా రూ.27 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.2°/ 20.8°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

రెండేళ్లలో మెడికల్ కళాశాలను ప్రారంభిస్తాం



భూమి పూజలో పాల్గొన్న మంత్రులు సత్యకుమార్, సవిత, ఎంపీ పార్థసారథి

సోమందేపల్లి: పెనుకొండలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలను 2027 నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మంత్రి సవిత, ఎంపీ పార్థసారథితో కలిసి సోమందేపల్లిలోని నక్కల గుట్ట కాలనీలో కృష్ణుడి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత వాసులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందడంతో పాటు మెడికల్ సీట్లు పెరుగుతాయన్నారు. రాబోయే రెండేళ్లలో కళాశాల నిర్మాణం పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, ఎంపీపీ ఆది నారాయణ పాల్గొన్నారు.

లక్ష్యాలన్నీ సకాలంలో పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలు, మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతి సమాచారాన్ని సకాలంలో పంపే బాధ్యత ఆయాశాఖల ఉన్నతాధికారులపై ఉంటుందన్నారు. ఓటరు జాబితా మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను ఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా ఆర్డీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలన్నారు. ఈ–క్రాప్‌కు సంబంధించిన ఈ–కేవైసీ పెండింగ్‌లో లేకుండా వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి నుంచి చెత్తసేకరణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక్కసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని, తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలన్నారు. వర్షాల వల్ల దోమలు అభివృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పబ్లిక్ టాయిలెట్లకు నిరంతరం నీటి సరఫరా ఉండాలన్నారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామ, మండల స్థాయిలో చేపట్టాల్సిన వివిధ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సీపీఓ విజయ్ కుమార్, డీపీఓ సుమత, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

ధర్మవరం అర్బన్: అప్పు చెల్లించలేదంటూ ఓ లారీ డ్రైవర్‌పై వడ్డీ వ్యాపారి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. నార్పల మండలానికి చెందిన గోదిన గురుప్రసాద్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం తాడిపత్రి పట్టణానికి చెందిన జోసఫ్‌తో రూ.50 వేలను అప్పుగా తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో కంతులు సక్రమంగా చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 18న లారీలో సిమెంట్ లోడ్‌తో వెళుతున్న గురుప్రసాద్‌ను ధర్మవరంలోని మార్కెట్‌యార్డు వద్ద జోసఫ్ అడ్డుకుని తన అనుచరులు బాబా ఫకృద్దీన్, ఖాసీం, సునీల్, అబ్దుల్లా, మరో వ్యక్తితో కలసి విచక్షణారహితంగా దాడి చేశాడు. బెల్టు, కాళ్లు, చేతులతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్ తన సొంతూరికి వెళ్లి కోలుకున్న తర్వాత శుక్రవారం ధర్మవరం రెండో పట్టణ పీఎస్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామగిరిలో రౌడీ రాజ్యం

- ఏడాదిన్నరగా అరాచకాలు, అక్రమాలు
- భూముల ఆక్రమణ, పంటపొలాల దున్నివేత
- దోపిడీలు, దౌర్జన్యాలతో జనం బెంబేలు
- అధికారం అడ్డు పెట్టుకుని సామాన్యులపై ఇష్టారాజ్యంగా కేసులు
- బాధితులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోని పోలీసులు
- ఎమ్మెల్యే పరిటాల సునీత అండతో 'తెలుగు తమ్ముళ్ల' దౌర్జన్యాలు



సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో 'పచ్చ' రౌడీలు రాజ్యమేలుతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఏళ్లుగా సాగులో ఉన్న వారిని బెదిరించి పంటలను దున్నేసి పొలాలను ఆక్రమిస్తున్నారు. గతంలో ఇతరులకు విక్రయించిన ఇళ్లనూ దౌర్జన్యంగా తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ఎదురు మాట్లాడిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. తాము చెప్పినట్లు వినకపోతే గ్రామాల్లో ఉండలేరని వార్నింగ్ ఇస్తున్నారు. అడిగే వారు లేరు.. అడ్డుకునే వారు కరువు కావడంతో పచ్చ రౌడీల అరాచకాల పర్వం గ్రామ గ్రామానా కనిపిస్తోంది. తన కార్యకర్తలు ఏం చేసినా ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ వెనుకేసుకొస్తున్నారు. పైగా నష్టపోయిన బాధితులపైనే అక్రమ కేసులు బనాయించి స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు.. 'పచ్చ' నేతలకు కొమ్ము కాస్తుండటంతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొంది.



ఫిర్యాదు చేసేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన రామగిరి మండలం కొత్తగాదికుంట గ్రామస్తులు (ఫైల్)



పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య (ఫైల్)

ఊర్లొదిలేసినా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రామగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సుగాలి సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటికి టీడీపీ నేతలు వెళ్లి బెదిరించారు. వారం రోజుల్లో గ్రామం ఖాళీ చేసి వెళ్లాలని హుకుం జారీ చేశారు. లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. దీంతో అతను కుటుంబ సభ్యులతో కలిసి తమ బంధువులున్న పెనుకొండకు మకాం మార్చాడు. అక్కడి నుంచి ఊరికి వచ్చి వెళ్తూ.. పొలాల్లో పంటలు వేసుకున్నాడు. అయితే పంటలు కూడా వేయకూడదని హెచ్చరించారు. దీంతో భయపడి.. సాగుచేసిన పంట కూడా వేరే వాళ్లకు అప్పజెప్పి.. పెనుకొండలో కూలి పనులకు వెళ్తున్నాడు. ఆయన కుమార్తెకు తలసీమియా ఉండటంతో గతంలో పింఛన్ వస్తుండగా.. కూటమి అధికారంలోకి రాగానే ఆ పింఛన్ రద్దు చేయించారని బాధితుడు వాపోతున్నాడు. కనీసం తన ఇంట్లో కూడా ఉండలేని పరిస్థితుల్లో బంధువుల వద్ద తల దాచుకుంటున్నట్లు కన్నీటిపర్యంతమవుతున్నాడు.

ఇష్టారాజ్యంగా కేసులు..

రామగిరి మండలంలో ఎలాంటి ఘటన జరిగినా.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఘటనలోనూ పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిన్న ఘటనలోనూ వందల మందిపై కేసులు నమోదు చేశారు. ఎంపీపీ ఎన్నికల సందర్భంగా పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఘర్షణ విషయంలోనూ టీడీపీ కార్యకర్తలను వదిలేశారు. పాపిరెడ్డిపల్లి హత్య కేసులో కేవలం ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై మాత్రమే కేసు కట్టడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారం తమదేనంటూ..

రామగిరి మండల వ్యాప్తంగా దోపిడీలు, దౌర్జన్యాలు, అరాచకాలతో పాటు అత్యాచార ఘటనలు వెలుగు చూశాయి. ఏడుగుర్రాలపల్లి గ్రామంలో ఓ దళిత మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 14 మంది టీడీపీ కార్యకర్తలు అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక గర్భం దాల్చడంతో అసలు విషయం వెలుగు చూసింది. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన వారిపై కేసులు నమోదు చేయడం గమనార్హం.

పోలీసు వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన జనం..

రామగిరి మండలంలో పోలీసుల తీరుపై ప్రజలకు నమ్మకం పోయింది. రాజకీయ కార్యక్రమాలు, ఉప ఎన్నికల్లో హంగామా చేసే ఎస్‌ఐ.. ఆ తర్వాత కేవలం సివిల్ పంచాయితీలకే పరిమితం అవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజా సమస్యల గురించి పట్టించుకోరని చెబుతున్నారు. పరిటాల కుటుంబానికి సన్నిహితుడిగా ఉంటూ.. భూ తగాదాల్లో జోక్యం చేసుకుంటూ.. సొమ్ము చేసుకుంటున్నట్లు ఎస్‌ఐపై ఆరోపణలున్నాయి.



కొత్తగాదికుంటలో డ్రిప్ పైపులు ధ్వంసం చేసిన దృశ్యం

పొలాలు దున్నేసి..



రామగిరి మండలంలో చీనీ చెట్లు దున్ని వేసిన దృశ్యం (ఫైల్)

సాధారణ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే రామగిరి మండలం మాదాపురం గ్రామంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పంట పొలాలను టీడీపీ నేతలు దౌర్జన్యంగా దున్నేశారు. బోరుబావులు తవ్వించి చీనీ చెట్లు సాగు చేసినా.. చెట్లను కూడా దున్నేసి ఆక్రమించారు. పొలాలన్నీ తమ ఆధీనంలోనే ఉంటాయని.. టీడీపీలో చేరితే పంట వేసుకోవచ్చని, లేనిపక్షంలో అడుగు కూడా పెట్టనిచ్చేది లేదని బెదిరించారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. చివరకు పుట్టపర్తికి వచ్చి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా... 'సివిల్ మేటర్' అంటూ అక్కడి అధికారులు చేతులెత్తేశారు.

గతంలో విక్రయించిన ఇల్లు స్వాధీనం కోసం దౌర్జన్యం..



పేరూరులో ఇంటిపై రాళ్లు రువ్వుతున్న టీడీపీ కార్యకర్తలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు తాము ఏం చేసినా చెల్లుతుందన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో విక్రయించిన స్థలం, ఇళ్లనూ తిరిగి దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు. ఇలాంటి సంఘటన రెండు రోజుల క్రితం రామగిరి మండలం పేరూరులో వెలుగు చూసింది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కట్టుకున్న ఇంటిపై ఓ నేత అనుచరులతో కలిసి రాళ్లు రువ్వి.. ఖాళీ చేయాలని బెదిరించారు. ఇంటిని తాము మార్కెట్ రేటుకు కొన్నామని చెప్పినా వినిపించుకోవడం లేదు. గతంలో ఆ స్థలం తమదేనంటూ దౌర్జన్యానికి దిగాడు. అడ్డొచ్చిన వారిపై దాడికి తెగబడ్డారు. అయితే ఇంత జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోలేదు. బాధితులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై పోలీసుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు.

25న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- బాలాజీ ఎంసీఏ కళాశాలలో వేదిక
- సర్టిఫికెట్ల పరిశీలన బృందాలకు నేడు శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు సిద్ధం చేసింది. అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు రోడ్డులోని బాలాజీ ఎంసీఏ కళాశాల వేదికగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఏర్పాట్లను శుక్రవారం డీఈఓ ప్రసాద్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్ అహమ్మద్ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం మొత్తం 18 బృందాలను నియమించారు. అన్ని కేడర్ల పోస్టులు కలిపి జిల్లాలో మొత్తం 807 పోస్టులను భర్తీ చేయనున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాటు చేసిన బృందాలకు శనివారం బాలాజీ ఎంసీఏ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు శిక్షణ ఉంటుందని డీఈఓ తెలిపారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

డీఎస్సీ–25కు సంబంధించి అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. జాబితాలను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్ అహమ్మద్

https://apdsc.apcfss.inలో, జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్లోనూ ఉంచారు. అభ్యర్థులకు వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ఐడీలు ద్వారా కాల్ లెటర్ పంపుతామని అధికారులు పేర్కొన్నారు. కాల్ లెటర్‌లో పేర్కొన్న సూచనలను అనుసరించాలని వెల్లడించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పరిశీలనకు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అంతకుముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని, అర్హతలేని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 10 కిలోల గంజాయి, మూడు బైక్‌ల స్వాధీనం

కదిరి అర్బన్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఆరుగురు సభ్యులుగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివనారాయణస్వామి గంజాయి ముఠా వివరాలు వెల్లడించారు.

ఆరుగురు ముఠాగా ఏర్పడి..

పట్టణంలోని జామియా వీధికి చెందిన అజాజ్ తన స్నేహితులు నాగరాజు వీధికి చెందిన షోయబ్, గాంధీనగర్‌కు చెందిన అర్బాన్, మహ్మద్ హుస్సేన్, అస్లాం, గౌస్‌బాషాతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. గంజాయి విక్రయాలతో డబ్బు సంపాదించాలనుకున్న అజాజ్ మహారాష్ట్రలోని జల్గామ్ జిల్లా ఫైజాపూర్ వాటర్ ట్యాంక్ ఏరియాలోని రాజు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి రైలులో తీసుకువచ్చేవాడు. అనంతరం గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లలో కట్టి తన స్నేహితులతో కలిసి కదిరి పరిసర ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఒక్కో ప్యాకెట్‌కు రూ. 200 నుంచి రూ. 500 వరకు తీసుకునే వాడు. ఈ క్రమంలోనే ఈ నెల 21న మహారాష్ట్ర నుంచి గంజాయి తెప్పించిన అజాజ్... దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లుగా కట్టేందుకు తన ఐదుగురు స్నేహితులతో కలిసి కదిరి మండలం కొండమనాయుని పాళెం గుట్టల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. గంజాయి రవాణా సమాచారం అందడంతో రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ సుమతి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి గంజాయి తరలిస్తున్న అజాజ్‌తో పాటు అతని స్నేహితులు ఐదుగురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, మూడు బైక్‌లు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు హ్యాండ్ బ్యాగులు, 4 తెల్లసంచులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు.



గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

పండగలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: దీపావళి, దసరా పండగలను దృష్టిలో ఉంచుకొని జోనల్ వ్యాప్తంగా దాదాపు 170 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో గుంతకల్లు డివిజన్‌లోని ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు. తిరుపతి – చర్లోపల్లి (07011) సెప్టెంబర్ 5 నుంచి 26 వరకు వారాంతపు (శుక్రవారం) ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా (4సర్వీసులు) నడుపుతామన్నారు. తిరిగి చర్లోపల్లి – తిరుపతి (07012) సెప్టెంబర్ 6 నుంచి 27 వరకు వారాంతపు (శనివారం) ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా (4 సర్వీసులు) నడపనున్నట్లు వెల్లడించారు. ఇక తిరుపతి – హిసర్ (07717) ఎక్స్‌ప్రెస్ రైళ్లు అక్టోబర్ 1 (బుధ) నుంచి నవంబర్ 26 వరకు వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు తెలిపారు. తిరిగి రైలు హిసర్ – తిరుపతి (07718) మధ్య అక్టోబర్ 5 (ఆదివారం) నుంచి నవంబర్ 30 వరకు నడుపుతామని పేర్కొన్నారు. ఇక ఈ నెల 26న బెంగళూరు – బీదర్, 27న బీదర్ – బెంగళూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్ కోతలు దుర్మార్గం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేకపోయిందని, పైగా ఇప్పటికే ఉన్న పింఛన్లను రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రీవెరిఫికేషన్ పేరుతో అర్హుల పింఛన్లు తొలగించేందుకు కూటమి సర్కార్ సిద్ధపడిందన్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గమన్నారు. ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లపైనే ఆధారపడి వేలాది మంది దివ్యాంగులు జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు వారి పింఛన్లు అనైతికంగా తొలగిస్తే వారు రోడ్డున పడతారన్నారు. పాలకులు వీలైతే సంపదను సృష్టించి కొత్త పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలవాలిగానీ, ఉన్న పథకాలను నిర్వీర్యం చేయకూడదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్ అందిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా, వేలాది మంది అర్హులైన దివ్యాంగులు, అంధుల పింఛన్లు రద్దు చేస్తూ నోటీసులివ్వడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. కడుపుమండిన పింఛన్ లబ్ధిదారులు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ నోటీసులను ఉపసంహరించుకుని, అర్హులందరికీ పింఛన్ అందేలా చూడాలని ఉషశ్రీచరణ్ కోరారు.



ఉషశ్రీ చరణ్

దాడులు శోచనీయం

ప్రజా ప్రతినిధులపై టీడీపీ గుండాలు దాడులకు పాల్పడటం ఆ పార్టీ దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై శుక్రవారం టీడీపీ నేతలు మారణాయుధాలతో దాడులకు తెగబడటం, హత్య చేసేందుకు ప్రయత్నించడం చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులెవరూ లేకుండా చేసేందుకు టీడీపీ దుష్ట పన్నాగం పన్నుతోందన్నారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలతో అరాచకంగా వ్యవహరిస్తున్న పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఇలాంటి దాడులకు వైఎస్సార్ సీపీ భయపడబోదన్నారు. ప్రజల పక్షాన మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తుందన్నారు. పురుషోత్తమరెడ్డికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

బాబ్బాబు. బార్లకు రండి!

సర్కారు మందు దెబ్బకు అధికారులు వీధినపడ్డారు. ఇప్పటికే పర్మిట్‌రూములు, బెల్టుషాపులతో పల్లెలకు పల్లెలే మత్తులో జోగుతుంటే తాజాగా బార్లలో పూటుగా తాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తాజాగా జారీచేసిన బార్ల నోటిఫికేషన్‌కు దరఖాస్తులు భారీగా వచ్చేటట్టు చూడాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులు బార్ల లైసెన్సుకు దరఖాస్తులు వెయ్యండంటూ ఊరూరా తిరుగుతున్నారు.

లైసెన్సులకు దరఖాస్తు చేసుకోండంటూ వేడుకోలు

- సర్కారు టార్గెట్‌తో వీధినపడ్డ ఎక్సైజ్ అధికారులు
- ఒక్కో బార్‌కు కనీసం 10 దరఖాస్తులు రావాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ ఒక్క దరఖాస్తూ రాని దుస్థితి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులపై కమిషనర్ మండిపాటు
- ఊరూరా తిరుగుతున్న సూపరింటెండెంట్, డిప్యూటీ కమిషనర్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం ఇటీవల నూతన బార్ పాలసీ ప్రకటించింది. బార్ల లైసెన్సులకు నోటిఫికేషన్ జారీ చేసింది. వారం కావస్తున్నా ఒక్క దరఖాస్తూ రాలేదు. దీంతో ఎక్సైజ్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులపై మండిపడ్డారు. 'మీరు ఏం చేస్తారో మాకు తెలియదు. ఒక్కో బార్‌కు కనీసం 10 దరఖాస్తులు రావాలి. అంతకంటే తక్కువ వస్తే బావుండదు' అంటూ కోప్పడ్డారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 32 బార్లు ఉన్నాయి. ఈ లెక్కన 320 దరఖాస్తులు రావాలనేది సర్కారు లక్ష్యం.

ఉరుకులు, పరుగులు

మూడు రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డిలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ధాబాలు, రెస్టారెంట్ల ఓనర్లు, కల్లుగీత (ఈడిగ) సంఘాల ప్రతినిధులను పిలిపించుకుని బతిమాలుతున్నారు. 'మీకు మంచి భవిష్యత్తు ఉంటుంది.. మీరు బార్ లైసెన్సుకు దరఖాస్తు చెయ్యండి' అని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే అనంతపురం, గుంతకల్లు, పుట్టపర్తి తదితర చోట్ల పిలిపించుకుని సమావేశాలు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి ధాబాలు నిర్వహించుకునే ఓనర్లను కూడా పిలిపించి 'మీకు మేమున్నాం.. మా మాట విని దరఖాస్తు చేయండి మీకు మంచి లాభాలు వస్తాయి. ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకూ వ్యాపారం చేసుకోవచ్చు. మీకిష్టమొచ్చిన రేటుకు అమ్ముకోవచ్చు' అంటూ పేరు పేరునా పిలిచి వేడుకున్నంత పని చేస్తున్నారు.



గుంతకల్లులో హోటళ్లు, ధాబా యజమానులతో సమావేశమైన ఎక్సైజ్ అధికారులు

ఉమ్మడి అనంత జిల్లాలో బార్ల వివరాలు..

ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన బార్ల సంఖ్య	32
ఏడాదికి కట్టాల్సిన సొమ్ము	రూ.55 లక్షలు
కట్టాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్లు	6
దరఖాస్తుకు చెల్లించాల్సింది	రూ.5 లక్షలు
దరఖాస్తుకు చివరి తేదీ	ఆగస్టు 26

అధికారులకు ఇదేమి దుస్థితి?

అధికారులే దరఖాస్తుల కోసం ఊరూరా తిరుగుతూ బతిమాలుతున్న దుస్థితిపై ఎక్సైజ్ సిబ్బందిలో చర్చ జరుగుతోంది. నోటిఫికేషన్ ఇస్తే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటారు. కానీ ఆదాయం కోసం సర్కారు దిగజారి వ్యవహరిస్తోందని విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం తాగిస్తున్నా.. మరింతగా మద్యం అమ్మకం కోసం బార్లపై విస్తృతంగా ప్రచారం చేసి ఎక్కువ దరఖాస్తులొచ్చేలా చేయాలని చెబుతుండటం సిగ్గుచేటని ఎక్సైజ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ప్రేమ పెళ్లికి నిరాకరణ.. యువకుడి ఆత్మహత్య



మృతుడు గుణ

బత్తలపల్లి: ప్రేమించిన బంధువుల అమ్మాయితో పెళ్లికి యువతి తల్లిదండ్రులు నిరాకరించడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం రాఘవంపల్లి గ్రామానికి చెందిన తలారి నరసింహులు కుమారుడు తలారి గుణ (18) తన బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు వారి ప్రేమను అంగీకరించకపోవడంతో క్షణికావేశంలో గురువారం రాత్రి తన మామిడి తోటలోని చెట్టుకు చీరతో ఉరి చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం



మృతుడు మునెప్ప

ఎన్పీకుంట: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎన్పీకుంట మండలం ధనియాని చెరువు గ్రామానికి చెందిన వల్లెపు మునెప్ప (59)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాలికి గాయం కావడంతో కొంత కాలంగా ఏ పని చేయలేక ఇంటి పట్టునే ఉంటూ వచ్చాడు. దీంతో కుటుంబ అవసరాలు, చికిత్స కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక గురువారం రాత్రి క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు గమనించి కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్ల అగచాట్లు

- స్త్రీ శక్తి పథకంతో రోడ్డున పడిన ఆటో కార్మికులు
- జిల్లాలో 42 వేల మందిపై ప్రభావం
- రుణాల కంతులు చెల్లించలేక ఇబ్బందులు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు



ప్రయాణికులు లేక ప్రశాంతి గ్రామం వద్ద చెట్ల కింద నిలిపిన ఆటోలు

పుట్టపర్తి అర్బన్: స్త్రీ శక్తి పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. వేలాది మంది ఆటో కార్మికులను బజారున పడేసింది. ఇంత కాలం స్టేజ్ టు స్టేజి వెళ్లడానికి ఆటోలపై రోజూ వేలాది మంది ప్రయాణించేవారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు, ఉద్యోగినులు, విద్యార్థినులు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తుండడంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల జీవనం దుర్భరంగా మారింది. రోజంతా వేచి చూసిన రూ.100 కూడా ఆదాయం లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

వాహన మిత్రతో ఆదుకున్న వైఎస్ జగన్..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకంతో ఆటో డ్రైవర్లను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికీ రూ.10 వేలు చొప్పున ఏటా ఆర్థిక సాయాన్ని అందజేస్తూ వచ్చారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఆటో కార్మికుడికి రూ.15వేలు అందజేస్తామని కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే ఆటో డ్రైవర్లను దగా చేశారు. రెండో ఏడాదిలో ఇప్పటికే సగం గడిచిపోయింది. అయినా రూ.15 వేల ఆర్థిక సాయంపై ఎలాంటి ఊసు లేదు. దీనికి తోడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రస్తుతం ఆటో కార్మికుల జీవనం దుర్భరంగా మారింది.

రుణం కంతు చెల్లించడమూ భారమే..

జిల్లా వ్యాప్తంగా ఆటోలు, జీపులపై ఆధారపడి దాదాపు 42 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో రుణాలు తీసుకుని వాహనాలు సమకూర్చుకున్నారు. కనీసం రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ ఆదాయం ఉండేది. ఈ సంపాదనతోనే క్రమం తప్పకుండా నెలకు రూ.5 వేలకు పైగా రుణం కంతులు చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటోలకు అద్దెలు దొరక్క ఎక్కడికక్కడ స్టాండ్లలో నిలిచిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి ఉన్నా.. రూ. 100 కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులోకి వచ్చిన వారం రోజుల్లోనే కుటుంబాల ఆర్థిక పరిస్థితి దిగజారిందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. వచ్చే 1వ తేదీన రుణాల కంతులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవనోపాధి కల్పించండి

పుట్టపర్తి టౌన్: స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా ఆటో డ్రైవర్ల జీవనోపాధి కోల్పోయామని మాకు జీవనోపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆటోడ్రైవర్లు కోరారు. ఈ మేరకు వారి బాధలు, జీవనోపాధిని వివరిస్తూ తీసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. పుట్టపర్తి పట్టణంలోనే దాదాపు 500 మంది ఆటోలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఆటోల్లో మహిళలు ప్రయాణించకపోవడంతో రోజుకు రూ.150 సంపాదన కూడా లేదన్నారు. 8 శాతం వడ్డీతో ఫైనాన్స్ కంపెనీల్లో రుణం తీసుకుని ఆటోలు కొనుగోలు చేశామని, ఇప్పటికే కంతులు చెల్లించలేని 150 ఆటోలను ఫైనాన్స్ కంపెనీలు స్వాధీనం చేసుకున్నారని వాపోయారు. స్త్రీ పథకం పుణ్యమా అని మిగిలిన ఆటోలను కూడా త్వరలో ఫైనాన్స్ కంపెనీ వారు జప్తు చేస్తే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయం చూపాలి



ఫ్రీ బస్సు పథకానికి మేము వ్యతిరేకం కాదు. కానీ ఆటోలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత కూడా ఈ ప్రభుత్వంపై ఉంది. రోజూ ఆటోలు ఎక్కువగా ఎక్కేది మహిళలే. ఇప్పుడు వారంతా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. రోజంతా ఆటో నడిపినా రూ.200 కూడా రావడం లేదు. ఆటోకు డీజిల్, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆటో మరమ్మతులు, రుణం కంతులు, ఎఫ్‌సీలు ఎలా చేయించుకోవాలో అర్థం కావడం లేదు. – నబీరసూల్, లోచర్ల, కొత్తచెరువు మండలం

రూ.25 వేలు ఇవ్వాలి



ఆటోలు, జీపులు, ఇతర వాహనాల ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.25 వేలు అందజేయాలి. ఎన్నికల హామీని అమలు చేయకుండా ఇప్పటికే ఏడాదిన్నర గడిపేశారు. డిమాండ్ సాధనకు త్వరలో రాష్ట్ర వ్యాప్తం ఆందోళనలు చేపట్టనున్నాం. – బాబావలి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి

యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన సుందర్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పోషణ, ఇంటి నిర్మాణానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జూలైలో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఎంటెక్ ఒకటి, మూడవ సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ, ఎంఫార్మసీ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి. శంకర శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం. అంకారావు తదితరులు పాల్గొన్నారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

సోషల్ మీడియాతో సమాజానికి కీడు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సిటీ: సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) విపరీత ధోరణితో సమాజానికి కీడే ఎక్కువ జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సంచలనాల పేరుతో నిజాలు నిర్ధారించుకోకుండా ఇష్టమొచ్చినట్లు ప్రచారం, ప్రసారం చేయడం వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఉమ్మడి జిల్లా మహాసభ జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర యాదవ్ అధ్యక్షత వహించగా.. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రవితేజ, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే విధంగా కథనాలు ఉండాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యువల్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. అక్రిడిటేషన్ కమిటీల్లో అన్ని సంఘాలకు అవకాశం కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో జర్నలిస్టులకు మరింత చేయూతనందిస్తామని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు జర్నలిజంతోనే ముడిపడి ఉందని ఉప్పల లక్ష్మణ్ అన్నారు. అయితే చాలా మంది జర్నలిస్టులు అక్రమార్కుల కొమ్ము కాస్తు నిజాలను రాయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిజాలే రాయాలని, అప్పుడే మెరుగైన సమాజ నిర్మాణంలో మన పాత్ర పోషించిన వారమవుతామని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో తమ యూనియన్ ముందుంటుందని హామీ ఇచ్చారు.

వివాహిత మృతి.. భర్తపై కేసు నమోదు

తాడిమర్రి: వివాహిత మృతి కేసులో ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను తాడిమర్రి ఎస్ఐ కృష్ణవేణి శుక్రవారం వెల్లడించారు. తాడిమర్రి మండలం రామాపురం గ్రామానికి చెందిన బొమ్మలాట రాజుకు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లికి చెందిన బండారు గంగమ్మ కుమార్తె రామాంజినమ్మ (27)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన రాజు కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. గత మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తాగొచ్చి భార్యతో గొడవపడి కర్రతో ఆమె తలపై కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన రామాంజినమ్మను కుటుంబ సభ్యులు, బంధువులు అనంతపురంలోని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న మంచు మనోజ్ దంపతులు



మంచు మనోజ్ దంపతులను స్వాగతిస్తున్న దృశ్యం

అమరాపురం/మడకశిర: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం సినీ హీరో మంచు మనోజ్ దంపతులు సందర్శించారు. వారికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం 5 గంటలకు మడకశిర మీదుగా బెంగళూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా వారి వెంట స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ ఉన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ

- ముగ్గురికి గాయాలు

ధర్మవరం అర్బన్: స్థానిక పోతుకుంట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. దుర్గానగర్‌కు చెందిన ముత్యాలప్ప తన ద్విచక్ర వాహనంపై బ్రిడ్జిపై వెళుతుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన హర్షసాయి, అక్షయ్‌కుమార్ ఢీకొన్నారు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను గుర్తించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మహిళా ఇంజినీర్ ఆత్మహత్య

- మానసిక కుంగుబాటుతో అఘాయిత్యం

అనంతపురం: హెచ్చెల్సీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సుమియ(32) ఆత్మహత్య చేసుకున్నారు. మానసిక కుంగుబాటుకు గురై ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలంలోని రామప్ప వీధిలో నివాసం ఉండే కొండకమర్ల బాబాసాహెబ్ రెండో కుమార్తె కె.సుమియకు గుంతకల్లుకు చెందిన పామిడి మహమ్మద్ షఫీతో 2020లో వివాహమైంది. ఈమె అనంతపురం హెచ్చెల్సీ ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఆర్.కె.నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి మూడేళ్ల వయసున్న మన్హా సాఫియా, రెండేళ్ల వయసున్న మహిరా ఇరమ్ సంతానం. రెండో కాన్పు తర్వాత నుంచి సుమియాకు హార్మోన్ల సమతుల్యత లోపించడంతో మానసికంగా కుంగుబాటుకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మానసిక వైద్య నిపుణుడి వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. వారం రోజులుగా మాత్రలు వేసుకోకపోవడంతో మానసిక రుగ్మత అధికమైంది. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని పలు దఫాలుగా ప్రయత్నించగా కుటుంబ సభ్యులు వారించారు. ఈ విషయాన్ని మహమ్మద్ షఫీ తన మామ బాబాసాహెబ్‌కు చెప్పాడు. దీంతో ఆయన గురువారం సుమియా ఇంటికి వచ్చారు. ఆమెకు నచ్చచెప్పి డాక్టర్ వద్ద చూపించారు. అయినా కూడా సుమియా నిద్రకపోకుండా తాను చనిపోతానంటూ ఏడుస్తూనే ఉండటంతో తండ్రి, కుటుంబ సభ్యులు ఓదార్చారు. అదే రోజు రాత్రి 10 గంటలకు అందరూ కలిసి భోజనం చేసి, నిద్రపోయారు. సుమియా, ఆమె భర్త షఫీ, చిన్నపిల్లలు ఒక బెడ్‌రూంలో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుమార్తె నిద్రపోయిందా లేదా అని బాబాసాహెబ్ గదివైపు రాగా.. అప్పటికే సుమియా చీరతో ఫ్యానుకు వేసుకున్న ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి సుమియా చనిపోయిందని నిర్ధారించారు. మృతురాలి తండ్రి, భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేశారు.

నడకే.. ఆరోగ్య రహస్యం!

- కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న 80 ఏళ్ల వృద్ధుడు
- తమలపాకుల వ్యాపారంతో జీవనం
- నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం నడక

నడక సరళమైనది... ఇందుకు నయా పైసా ఖర్చు కాదు. పూర్తిగా ఉచితం. క్రమం తప్పని నడక మానసిక స్థితిని పెంచుతుంది. నిరాశ నుంచి బయటపడేస్తుంది. ఇందుకు నిదర్శనమే ఆకుల వెంకటస్వామి. ఎనిమిది పదుల వయస్సులోనూ ఎవరి మీదా ఆధారపడకుండా సొంతంగా తమలపాకుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వెంకటస్వామి తన స్ఫూర్తిదాయక జీవనంపై ఏమంటున్నారో.. ఆయన మాటల్లోనే.. – పరిగి:



శ్రీరంగరాజుపల్లిలో ఆకులు అమ్ముతున్న దృశ్యం

"మాది పరిగి మండలం గొరవనహళ్లి గ్రామం. 80 ఏళ్ల వయస్సు. భార్య వెంకటమ్మ, కుమారులు, కుమార్తెలు ఉన్నారు. నాకు బుద్ధి ఎరిగినప్పటి నుంచి తమల పాకుల వ్యాపారం సాగిస్తున్నా. ఇదే మా బతుకు తెరువు. ఈ వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంతోనే కుమారులు, కుమార్తెలకు పెళ్లిళ్లు చేశా. ప్రస్తుతం నా భార్యతో కలసి స్వగ్రామంలోనే ఉంటున్నా. ఇప్పటికీ తమల పాకుల వ్యాపారం చేస్తూనే ఉన్నా.

రోజూ నడుస్తా..

తమల పాకుల కోసం రోజూ హిందూపురానికి వెళ్లి వస్తుంటాను. గంపలో తమలపాకులు పెట్టుకుని మా ఊరి నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరంగరాజుపల్లికి నడుచుకుంటూ వెళ్లి వీధివీధినా తిరిగి అమ్ముతుంటాను. అంగళ్లకు, కిరాణా షాపులకు కూడా ఆకులు ఇస్తుంటాను. తిరుగు ప్రయాణంలో ఆటో దొరికితే సరి.. లేకపోతే నడుచుకుంటూ సొంతూరికి చేరుకుంటా.



తమలపాకుల వ్యాపారానికి వెళుతున్న ఆకుల వెంకటస్వామి

ఏనాడూ జబ్బు పడలేదు..

రోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా రాగి సంగటి తింటా. వ్యాపారం కోసమని నాలుగు కిలోమీటర్లు నడుస్తా. ఇక బీడీ, సిగరెట్, మద్యం తాగడం ఇలాంటి అలవాట్లు లేవు. తిని ఇంట్లో ఊరకే కూర్చోవడం నాకు చేత కాదు. నడక వల్ల నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఏనాడూ జబ్బు బారిన పడింది లేదు. ఒకరి మీద ఆధారపడకుండా సొంతంగా జీవించాలని అనుకున్నా. అందుకే 30 ఏళ్లకు పైగా సాగిస్తూ వస్తున్న తమలపాకుల వ్యాపారాన్ని వదలకుండా చేస్తూనే ఉన్నా. సంపాదించిన దానిలోనే బిడ్డలకు ఏదైనా అవసరమైతే సాయం చేస్తా. నాకు నేనుగా ఎవరినీ పైసా కూడా అడిగింది లేదు. రోజూ 10 నుంచి 15 కట్టల ఆకులను అమ్ముతుంటాను. వెంకటస్వామిగా పేరున్న నాకు తమలపాకులు అమ్మడం ద్వారా ఆకుల వెంకటస్వామిగా గుర్తింపు వచ్చింది. కేవలం నడక ఒక్కటే నా ఆరోగ్య రహస్యం."